

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	36	21.0
భద్రాద్రి	37.7	23.5



పలకరించిన ప్రకృతి నేస్తం

కార్తె ప్రారంభంతోనే దర్శనమిచ్చిన ఆరుద్ర పురుగులు

ఆరుద్రకార్తె ప్రారంభానికి చిహ్నమైన ఆరుద్ర పురుగు ఆదివారం భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని పంటపొలాల్లో దర్శనమిచ్చింది. పట్టులాంటి మృదుత్వంతో ఎరుపు రంగుల్లో బొద్దుగా కనిపించే ఆరుద్ర పురుగులు మండు టెండలకి నెర్రలు బారిన నేలపై తొలకరి చినుకులు కురవడంతో ప్రాణం పోసుకుని నేలలోపలి నుంచి బయటికి వస్తాయి. అతి సున్నితమైన ఈ జీవి కేవలం ఆరుద్రకార్తెలోనే మాత్రమే దర్శనమివ్వడం దీని ప్రత్యేకత. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోవడంతో పర్యావరణ నేస్తమైన ఈ ఆరుద్ర పురుగులు అంతరించిపోతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- లక్ష్మీదేవిపల్లి



భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

నిత్యకల్యాణంలో పాల్గొన్న 95 జంటలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారికి ఆదివారం అంతరాలయంలో ప్రత్యేక అభిషేకం, స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వైదిక బృందం శాస్త్రోక్తంగా కల్యాణ తంతును నిర్వహిచారు. ఈ సందర్భంగా నిత్యకల్యాణానికి ముందు విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, ఆశీర్వచనం నిర్వహించారు. స్వామివారి నిత్య కల్యాణంలో 95 జంటలు పాల్గొన్నాయి.

- భద్రాచలం

మూగబోయిన కంచుడోలి



- పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య కన్నుమూత
- డోలి వాయిద్య కళాకారుడిగా 2022లో పద్మశ్రీకి ఎంపిక
- గత కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో ఇబ్బందులు
- పరిస్థితి విషమించి కూనవరంలోని స్వగృహంలో తుదిశ్వాస
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి సంతాపం
- నివాళులర్పించిన భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

మణుగూరు/ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 23: భద్రాద్రి జిల్లా మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిని రామచంద్రయ్య (65) ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. డోలి(కంచుమేళ) వాయిద్య కళాకారుడిగా 2022 జనవరి 25న ఆయన రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. గత కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న రామచంద్రయ్య హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. గత ఏడాది డిసెంబర్ నుంచి తన తండ్రి ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడని, ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా పలుచోట్ల రూ.14 లక్షల వరకు అప్పులు తెచ్చి ఖమ్మం, హైదరాబాద్, విజయవాడకు తీసుకెళ్లి వైద్యం చేయించామని రామచంద్రయ్య కుమారుడు బాబూరావు తెలిపారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో మెరుగైన వైద్య సేవలు అందించలేక పోయామన్నారు. పద్మశ్రీ అవార్డుకు సంబంధించిన ప్రభుత్వ ప్రోత్సాహకం అంది ఉంటే తన తండ్రిని ఇంకొన్నాళ్లయినా బతికి ఉండేవాడని కన్నీటి పర్యంతమయ్యాడు. పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మృతితో కూనవరం గ్రామంలో విషాదం అలుముకుంది. రామచంద్రయ్యకు భార్య బాపనమ్మ, కుమారుడు బాబూరావు, కుమార్తెలు వాణి, వసంత, సుమలతలు ఉన్నారు. రామచంద్రయ్య మృతి పట్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంతాపం తెలిపారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న కలెక్టర్ కూనవరం వెళ్లి రామచంద్రయ్య భౌతికకాయం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. రామచంద్రయ్య మృతి వార్త తెలుసుకొని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. మణుగూరుకు చెందిన పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు వార్డు సభ్యులు, ఆదివాసీ సంఘాల నాయకులు రామచంద్రయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. స్వగ్రామం కూనవరంలో సోమవారం రామచంద్రయ్య అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మంత్రుల సంతాపం..

అంతరించిపోతున్న డోలు వాయిద్యానికి జీవం పోసిన కళాకారుడు రామచంద్రయ్య అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆయన అకాల మృతి కళారంగానికి తీరని లోటన్నారు. తెలంగాణలో డోలు వాయిద్యానికి మంచి గుర్తింపు తెచ్చారన్నారు. రామచంద్రయ్య అకాల మరణం పట్ల డిప్యూటీ సీఎం సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. సకిని రామచంద్రయ్య మృతిపట్ల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంతాపం ప్రకటించారు.



నెరవేరని పద్మశ్రీ సకిని స్వప్నం

- ముందుకు సాగని గిరిజన సంప్రదాయ నృత్య పాఠశాల
- 2022 నుంచి నిధులు కేటాయించని అప్పటి ప్రభుత్వం
- ఆయన గౌరవ వేతనమూ మరిచిన వైనం

4

మసిపూసి మాయ చేస్తున్నారో.. లేక అక్రమార్కులకు వంతపాడుతున్నారో తెలియదు కానీ జిల్లాలో జీవో 59 మాటున జరిగిన అక్రమాల వ్యవహారాన్ని అధికారులు పక్కన పెట్టేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా దుమారం లేపిన ఈ వ్యవహారంలో ఎలాంటి విచారణ కానీ, అధికారులపై చర్యలు కానీ చేపట్టకుండా అసలుకు మందుగా కొసరు చూపిస్తూ అటు ప్రజలను, ఇటు మంత్రులను పక్కదారి పట్టిస్తున్నారన్న విమర్శలు భారీగా వినిపిస్తున్నాయి. జిల్లాలో జీవో 59 అక్రమబద్ధీకరణకు సంబంధించి భారీగా అక్రమాలు జరిగినా ఇప్పటివరకు కేవలం ఒక్క స్థలానికి సంబంధించి మాత్రమే అధికారులు చర్యలు తీసుకోవడం వెనుక అంతర్యమేంటన్న చర్చ జరుగుతోంది.



ఆంధ్రజ్యోతి ప్రధాన, జిల్లా సంచికలో పత్రికలో ప్రచురితమైన కథనాలు

అ'క్రమంగా' పక్కన పెట్టారు!

ఖమ్మం, జూన్23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా నిర్మించుకున్న గృహాలకు తగిన ధరను చెల్లించి క్రమబద్ధీకరించుకునేందుకు గత ప్రభుత్వం జీవో 59ను తీసుకొచ్చింది. ఈ జీవోను అడ్డం పెట్టుకొని అక్రమార్కులు తమకు అవకాశం ఉన్న మేరకు ప్రభుత్వ భూమిని క్రమబద్ధీకరించుకునేందుకు భారీగా దరఖాస్తులు చేశారు. అయితే ఆయా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్రమబద్ధీకరణ చేయాల్సి అధికారులు నిబంధనలను గాలికొదిలి రూ.కోట్లు విలువచేసే వేల గజాల స్థలాలను నామమాత్రపు ధరలకు రెగ్యులరైజ్ చేశారు. కేవలం ఒక్క ఖమ్మం అర్బన్ రెవెన్యూ పరిధిలోనే జీవో 59 కింద సుమారు 180 మందికి క్రమబద్ధీకరణ చేయగా.. వాటిల్లో 40మందికిపైగా అక్రమ పద్ధతిలో హక్కులు పొందినట్లు ఆరోపణలున్నాయి. ఈ జీవోను అడ్డం పెట్టుకొన్ని ఖమ్మం నగర పరిధిలో సుమారు ఆరు వేల గజాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాని విలువ మార్కెట్ ధరల ప్రకారం రూ.100కోట్లు ఉంటుందని అంచనా.



DEED OF CONVEYANCE

వేణుగోపాల్ నగర్-2లో 317 గజాలను రెగ్యులరైజ్ చేసుకున్న డాక్యుమెంట్

విషయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నాలు

గతేడాది డిసెంబరులో అక్రమ క్రమబద్ధీకరణల వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో స్పందించిన ఉన్నతాధికారులు అక్రమాల నిగ్గు తేల్చేందుకు ప్రత్యేకంగా కమిటీని నియమించారు. కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాలను పరిశీలిస్తే అధికారులు తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. అసలు అక్రమంగా క్రమబద్ధీకరణ చేసిన విషయాలను పక్కనపెట్టి తిరస్కరించిన దరఖాస్తులకు సబంధించిన భూముల అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. అందులోనూ సుమారు 22మందిపై కేసులు నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినా కేవలం ఇద్దరు, ముగ్గురిపై మాత్రమే ఫిర్యాదులు ఇచ్చి చేతులు దులుపుకోవడం వెనుక మతలబేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించిన ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు ఫెన్సింగ్‌లు వేసి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వరకు బాగానే ఉన్నా అసలు దొంగ డాక్యుమెంట్లతో స్థలాలను కాజేసిన వారిగురించి మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. మొదట అక్రమాల వ్యవహారం వెలుగులోకి వచ్చిన సమయంలో ఓ కార్పొరేటర్‌కు సంబంధించిన డాక్యుమెంటును రద్దు చేయడంతోపాటు, కేసు కూడా నమోదు చేశారు. కానీ అలాంటి కేసులు ఖమ్మం నగరంలో పదుల సంఖ్యలో ఉన్నా వాటిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

మూలాలు మునిసిపల్ కార్పొరేషన్‌లోనే..

జీవో 59ప్రకారం క్రమబద్ధీకరణ పొందాలంటే సదరు వ్యక్తుల గుర్తింపు కార్డులతో పాటుగా, వారు పొజిషన్‌లో ఉన్నట్లు ఏదైనా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఇంటిపన్ను రశీదులు, విద్యుత్ బిల్లు, నీటిపన్ను వంటి ధృవీకరణ పత్రాలు చూపించాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో క్రమబద్ధీకరించిన ఇంటినెంబర్లు మాత్రం సంబంధం లేని వ్యక్తుల పేర్ల మీద ఉండడం గమనార్హం. మరికొన్ని ఇంటి నెంబర్లు అసలు రికార్డుల్లోనే లేకపోవడం విస్తుపోవాల్సిన అంశం. ఇక మరికొన్ని డాక్యుమెంట్లలో అసలు ఇంటి నెంబర్లు లేకుండానే రెగ్యులరైజ్ చేశారన్న ఆరోపణలున్నాయి. ఆయా అక్రమ క్రమబద్ధీకరణలకు మూలాలు మాత్రం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే ఉన్నట్టుగా స్పష్టమవుతోంది.

జీవో 59 అక్రమ క్రమబద్ధీకరణలపై విచారణ కరువు

- కేవలం తిరస్కరించిన ప్రభుత్వ భూములపైనే దృష్టి
- ఫెన్సింగ్ వేసి విషయాన్ని పక్కదారి పట్టించిన వైనం
- సుమారు 6వేల గజాలు అక్రమార్కులకు రెగ్యులరైజేషన్
- అక్రమాలు వెలుగులోకి తీసుకొచ్చిన 'ఆంధ్రజ్యోతి'
- గతంలోనే మున్సిపల్ కమిషనర్‌ను నివేదిక అడిగిన కలెక్టర్
- ఎన్నికల కోడ్‌తో కాలయాపన
- కొత్త కలెక్టర్ దృష్టిసారించాలంటున్న ప్రజలు

గతంలోనే నివేదిక అడిగిన కలెక్టర్

అక్రమాల వ్యవహారం వెలుగులోకి వచ్చిన సమయంలో అప్పటి ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ మునిసిపల్ కమిషనర్‌ను నివేదిక అడిగినట్టు సమాచారం. కానీ అసలే అక్రమాలను కప్పిపెట్టే ప్రయత్నంలో ఉన్న సదరు శాఖ అధికారులు, ఎన్నికల సమయం రావడంతో దాన్ని బూచిగా చూపి కాలయాపన చేసినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా గొల్లగూడెం రోడ్డులోని ఓ అక్రమ క్రమబద్ధీకరణకు సంబంధించిన ఓ డాక్యుమెంటులో ఒకే ఇంటి నెంబర్‌ను ఇద్దరికి కేటాయించినట్టు, ఆ తర్వాత దానిని తొలగించినట్టు రిపోర్టు ఇచ్చినట్టు తెలిసింది. అయితే అసలు ఆ ఇల్లు నిర్మాణంలో ఉండటంతోపాటుగా, ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేస్తుండగా ఇంటినెంబరు ఎలా కేటాయించారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అసలు అసెస్‌మెంట్ ఆన్‌లైన్ అయిన తర్వాత కూడా ఒకే ఇంటి నెంబరు ఇద్దరికి ఎలా కేటాయించారన్నదానిపై కూడా అంతర్గత చర్చ సాగుతోంది. కాగా ప్రస్తుతం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ దీనిపై దృష్టిసారించి నిజాలను నిగ్గుతేల్చడంతోపాటు, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటారా ? లేదా? అన్న విషయంపై జిల్లాలో చర్చ జరుగుతోంది. గతంలో క్రమబద్ధీకరణతో సంబంధం ఉన్న అధికారులను పక్కన పెట్టి ప్రత్యేక కమిటీతో విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.



రాజ్యసభలో బీఆర్ఎస్ ఉపనేతగా వద్దిరాజు

ఖమ్మంకార్పొరేషన్, జూన్ 23: రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేతగా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఆదివారం నియమించారు. వద్దిరాజు రవిచంద్రకు రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి అవకాశం కల్పించిన కేసీఆర్ తాజాగా పార్లమెంటరీ ఉపనేతగా నియమించారు. వద్దిరాజుకు పదవి దక్కటం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు, బీసీసంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. తనను పార్టీ పార్లమెంటరీ ఉపనేతగా నియమించినందుకు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

హామీల అమలులో తగ్గేదేలేదు

- అర్హులైన పేదలందరికీ ఇల్లు, ఇంటి స్థలం ఇస్తాం
- గ్రామాల్లో మౌలికవసతులు కల్పిస్తాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆరెంపులలో మంత్రికి పాలు, పూలతో అభిషేకం

ఖమ్మం రూరల్, జూన్ 23: ప్రజలు ఎన్నో ఆశాలతో ఎన్నుకున్న ప్రజాప్రభుత్వం ఇచ్చిన హమీల అమలులో ఏమాత్రం వెనక్కుతగ్గే ప్రసక్తే లేదని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇచ్చిన ప్రతి హమీని నెరవేర్చి చూపిస్తామని తెపారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెంపుల, కైకొండాయిగూడెం, టీఎన్జీవోస్‌కాలనీ, నాయుడుపేట, తదితర గ్రామాల్లో ఆదివారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆరెంపుల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు ఏకేదఫా రుణమాఫీ చేస్తున్నందున సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్ రైతుల తరుపున మంత్రి పొంగులేటికి పాలు, పూలతో అభిషేకం చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలన్నింటినీ విడతల వారీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచుతామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో రైతును రాజును చేయాలనే సంకల్పంతో రాబోయే రెండు నెలల్లోనే రూ.31వేల కోట్లతో రుణమాఫీ చేయబోతున్నామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల కాకిగోలను తిప్పికొట్టేలా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో రూ.7లక్షల కోట్ల అప్పు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయి కొట్టుకుపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వం కాళేశ్వరం కోసం చేసిన అప్పులను ఇప్పుడు కట్టాల్సి వస్తోందన్నారు. పాలేరులోని ప్రతి గ్రామంలో ప్రతిఇంటి ముందు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం ప్రజలనుంచి మంత్రి వినతిపత్రాలు స్వీకరించారు. నాయుడుపేట గ్రామంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులుకు మంత్రి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి, జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, బండి జగదీష్, వెంకటరెడ్డి, వీరారెడ్డి, ముక్కా శేఖర్ గౌడ్, రవి, పద్మ, వెంకటేశ్వర్లు, పల్లెర్ల పాండు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటికి క్షీరాభిషేకం చేస్తున్న బండి జగదీష్

'ధరణి' సమస్యలకు మోక్షం

- 57,101 దరఖాస్తులకు పరిష్కారం
- ఇంకా పెండింగ్‌లో 8,340 దరఖాస్తులు
- రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఖమ్మం జిల్లా

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 23: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గత కొన్ని నెలలుగా ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాలతో పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆధ్వర్యంలో దరణి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ ఏడాది మార్చి 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ప్రభుత్వం ధరణి దరఖాస్తులకు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లాలో 78,710 అర్జీలు పెండింగ్‌లో (మిగతా 4వ పేజీలో)

ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి

- ఈ ఏడాదిలో 225 మైనర్ డ్రైవింగ్
- 4,094 ర్యాష్/స్పీడ్ డ్రైవింగ్ కేసులు నమోదు
- ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

5

పుట్టగొడుగుల్లా.. ప్లే స్కూల్స్

- కనీస ప్రమాణాలు పాటించని యాజమాన్యాలు
- చిన్నారుల భద్రతకు లేని భరోసా
- ఖమ్మం జిల్లాలో 40కి పైగా వెలసిన ప్లే స్కూల్స్
- పట్టించుకోని అధికారులు

4



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

కార్పొరేట్లకు కాపలాగా ప్రధాని మోదీ

- కార్మికుల హక్కులను కాలరాస్తున్న పాలకులు
- ఎర్రజెండాలు ఒకేతాటిపై నడవాలి
- ఏఐటీయూసీ మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

బూర్గంపాడు, జూన్ 23: ప్రజలకు కాపలాదారుగా ఉంటానని ఎన్నికల ముందు ప్రకటించిన ప్రధాని మోదీ గద్దెనెక్కిన తర్వాత కార్పొరేట్లకు కాపలాదారుగా మారారని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా మహసభల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ హయాంలో ప్రజాస్వామ్యం అపహస్యం అవుతుందని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సింగరేణి గనులను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. కార్మికులకు నిరసన తెలిపే అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఏఐటీయూసీ ఉందని ఎంతోమంది పేరుమోసిన నాయకులు కార్మికుల హక్కులకోసం పోరాటాలు చేశారని కొనియాడారు. ప్రస్తుతం అమలవుతున్న అనేక విధానాలు ఏఐటీయూసీ పోరాటాల ఫలితమేనని గుర్తు చేశారు. ప్రజల కోసం పోరాడే కమ్యూనిస్టు నాయకులను చట్టసభలకు పంపించాలని కోరారు. కార్మికులందరూ సంఘటితంగా ఉండాలని తమ హక్కుల కోసం పోరాటాలు చేయాలన్నారు. ఎర్రజెండాలు అన్ని కలిపి ఒకేతాటిపై నడవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు అవసరమైన చట్టాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర నాయకులు బొల్లోజు అయోధ్య, పాకాలపాటి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహరావు, భద్రాద్రి జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు సరెడ్డి పుల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు రేసు ఎల్లయ్య, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు కల్లూరి వెంకటేశ్వరరావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకుమారి, నాయకులు పేరాల శ్రీనివాసరావు, మువ్వా వెంకటేశ్వరరావు, ఐఎన్‌టీయూసీ, టీఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

మృతిచెందిన ఉపాధ్యాయుడికి పదోన్నతి

- విద్యాశాఖలో విచిత్రమైన ఉత్తర్వులు
- చనిపోకముందు ఆన్‌లైన్‌లో పదోన్నతి కోసం దరఖాస్తు...

అశ్వారావుపేట, జూన్ 23: 2023 ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి మృతిచెందిన 16 నెలలకు పదోన్నతి ఇస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిన సంఘటన తాజాగా జరిగింది. ఈ విచిత్రమైన ఉత్తర్వులకు సంబంధించి వివరాల్లోకి వెళితే ఇలా ఉన్నాయి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, చలమప్పగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేసే ఏవీ శ్రీనివాసరావు అనే ఉపాధ్యాయుడు గతేడాది ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు తెలంగాణ విద్యాశాఖ తాజాగా రెండు రోజుల క్రితం ఇచ్చిన పదోన్నతుల జాబితాలో ఆయన పేరును చేర్చి ఆయనకు పదోన్నతి కల్పించి, అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మృతి చెందిన పదహారు నెలల తరువాత సదరు ఉపాధ్యాయుడికి పదోన్నతిని కల్పిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పదోన్నతులు కల్పించే సమయంలో విద్యాశాఖాధికారులు తగిన జాగ్రత్తలు పాటించకపోవడంవల్లే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సోషల్ మీడియాలో ఈ విషయం చక్కర్లు కొడుతుంది. దీనిపై దమ్మపేట ఎంఈవో లక్ష్మిని వివరణ కోరగా ఆ ఉపాధ్యాయుడు మరణించకముందు ఆన్‌లైన్‌లో పదోన్నతికోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. పదోన్నతి జాబితా నేరుగా డీఎస్ఈ (రాష్ట్ర విద్యాశాఖ) నుంచి జారీ అవుతుందని, కొత్తగా పదోన్నతిని పొందిన వారు జాయిన్ కాని వాళ్ల జాబితాను తిరిగి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. విద్యాశాఖ నిర్వాకంతో మృతి చెందిన ఉపాధ్యాయునికి పదోన్నతిని ఇవ్వడంతో ఆ స్థానంలో సీనియారిటీ కలిగిన మరో ఉపాధ్యాయుడు పదోన్నతిని పొందే అవకాశాన్ని కోల్పోయాడనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



ఏవీ శ్రీనివాసరావు (మృతిచెందిన ఉపాధ్యాయుడు)

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో వీఎంబంజర్ విద్యార్థుల ప్రతిభ

పెనుబల్లి, జూన్ 23: ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో వీఎంబంజర్ విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించారు. ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఇండియన్ యోగా థెరపిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో వీఎం బంజర్‌కు చెందిన అబ్బాస్, అక్షయ గోల్డ్ మెడల్ సాధించగా, చింతకింద ధర్మిళా, కళ్యాణిలు సిల్వర్ మెడల్ సాధించారు. వీరికి శిక్షణనిచ్చిన యోగా మాస్టర్ రామకృష్ణకు యోగాచార్యులు సిద్ధిరాములు, రఘుకిషోర్‌లు ప్రశంసాపత్రాన్ని అందజేసి సన్మానించారు.



రామకృష్ణకు ప్రశంసాపత్రం అందజేస్తున్న యోగాచార్యులు

వారంలో బ్రిడ్జి మరమ్మతులు

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- పెద్దవాగు బ్రిడ్జి పరిశీలన
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కరకగూడెం, జూన్ 23: మండల కేంద్రంలోని పెద్దవాగు బ్రిడ్జి వద్ద రహదారి ప్రమాదకరంగా ఉందని వారంలో బ్రిడ్జి రహదారి మరమ్మతులు చేసేలా కృషి చేస్తానని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. కరకగూడెం నుంచి చిరుమళ్ళ వట్టంవారిగుంపు, పోలకమ్మతోగు, రాయణపేట, అరెంవారిగుంపు, కొలురు గ్రామాలకు వెళ్లే మధ్య పెద్దవాగు బ్రిడ్జి రహదారి గత సంవత్సరం కురిసిన వర్షాలకు పూర్తిగా తెగిపోవడంతో అధికారులు గ్రావెల్ పోసి చేతులు దులుపుకొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రావెల్ కుంగిపోవడంతో.. 19వ తేదీన 'పెద్దవాగు ప్రవాహంతో పొంచి ఉన్న ప్రమాదం' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించడంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదివారం పెద్దవాగును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన ఆయన అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెద్దవాగుపై ఉన్న చెట్లను, ఇసుక మేటలను తొలగించాలని అందుకు మైనింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తానన్నారు. అక్కడ ప్రజలు వర్షాలు పడుతున్నాయని మళ్లీ వరద ప్రవాహం వస్తే రహదారి పూర్తిగా కోతకు గురై పలు గ్రామాలకు రాకపోకలు నిలుస్తాయని తెలపడంతో ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ శాఖ అధికారులతో సమీక్ష ఏర్పాటు చేసి వారం రోజుల్లో ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వర్షాలు లేని సమయంలో చెట్లను, ఇసుక మేటలను తొలగించి శాశ్వత పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగ ప్రసాద్, ఆర్ఐ హుస్సేన్, ఏడూళ్లబయ్యారం సీఐ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచులు పోలెబోయిన శ్రీవాణి, తిరుపతయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు చందా మధు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్

తెలంగాణ దాల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొదుమూరి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 23: తెలంగాణ రాష్ట్ర దాల్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తగూడెం వాసి కొదుమూరి శ్రీనివాసరావు ఆదివారం హైదారాబాద్‌లో ఏకగ్రీవంగా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బిక్కుమళ్ల శ్రీధర్(తాండూర్), కోశాధికారిగా అభిషేక్ అగ్రవాల్(జహీరాబాద్), ఉపాధ్యక్షుడిగా తేరాల ప్రవీణ్(ఖమ్మం) తదితరులు నియమితులయ్యారు. అనంతరం అధ్యక్షుడిగా నియమితులైన కొదుమూరిని అసోసియేషన్ సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ప్రస్తుతం కొదుమూరి శ్రీనివాసరావు కొత్తగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా, భద్రాచలం వాసవి నిత్య అన్నదానం సత్రం సభ్యుడిగా, ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కొదుమూరికి ఖమ్మంపాటి రమేష్, మొరిశెట్టి భవానీ ప్రసాద్, అచ్చుతం, అశోక్‌రాఠీ, శంకర్‌బాబు, పల్లపోతు సాయిబాబా, పత్తులూరి ఉమా మహేశ్వరరావు, దారా నగేష్, ముక్కా కనకేశ్వర్‌రావు, చారుగుండ్ల మురళి, మిట్టపల్లి పాండురంగారావు, రాంబాబు, మహేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



కొదుమూరిని సన్మానిస్తున్న సభ్యులు

దేశంలో మోదీ పాలనలో మానవ హక్కుల ఉల్లంఘన..

- కార్మిక వర్గానికి ముంచుకొస్తున్న ముప్పు
- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కౌన్సిల్‌లో మానవ హక్కుల వేదిక నేత తిరుపతయ్య

ఇల్లెందు, జూన్ 23 : దేశంలో నరేంద్ర మోదీ ఫాసిస్టు పాలనలో ప్రశ్నించే హక్కు కాలరాస్తున్నారని యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందని ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటీకరణకు గురవుతున్నాయని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య విమర్శించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం ఆదివారం ఇల్లెందులో జరిగింది. ఇఫ్టు రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ అరుణపతాకాన్ని ఆవిష్కరించి కౌన్సిల్ సమావేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య మాట్లాడుతూ దండకారణ్యంలో ఆదివాసి గిరిజనులపై కేంద్ర ప్రభుత్వం క్రూరమైన అణచివేతకు పాల్పడుతుందని ఆరోపించారు. సింగరేణి కాలరీస్ లాంటి ప్రభుత్వ రంగ పరిశ్రమలను కుట్రపూరితంగా ప్రైవేట్ పరం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల హక్కుల కోసం ప్రశ్నించే వారిని మతోన్మాదులను నిలదీస్తున్న హేతువాదులను మోదీ ప్రభుత్వం హత్యలు గావిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఇఫ్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, ఇఫ్టు జాతీయ నాయకులు చీకట్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాద్, న్యూడెమోక్రసీ నాయకుడు భాస్కర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు రాంసింగ్, వూక్లానాయక్, మదార్, సాంబ తదితరులు ప్రసంగించారు. కౌన్సిల్ సమావేశం సందర్భంగా కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో వివిధ జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు.



ప్రసంగిస్తున్న మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య

భద్రాద్రి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా శ్రీకాంతారావు

నేడు బాధ్యతల స్వీకరణ

భద్రాచలం, జూన్ 23: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా శ్రీకాంతారావు సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. దేవాదాయ శాఖ వరంగల్ డిప్యుటీ కమీషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో శ్రీకాంతారావును తాత్కాలిక ఈవోగా నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు దేవస్థానం వర్గాలు తెలిపాయి.



'ధరణి' సమస్యలకు మోక్షం

(3వ పేజీ తరువాయి)

ఉండగా వాటిని స్థాయిని బట్టి కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లకు విభజించారు. జిల్లాలో 57101 దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ వరకు అధికారులు పరిష్కరించారు. ఇంకా 8340 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.



ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

- ప్రభుత్వ ఆదేశాలతో...!

ధరణి దరఖాస్తులు సుమారు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. పరిష్కరించే అధికారం తహసీల్దార్లకు ఆర్డీవోలకు లేకపోవడం భారం అంతా కలెక్టర్లు, సీసీఎల్‌ఏపైనే పడింది. దీంతో వేలాది దరకాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణిపై ప్రత్యేక చొరవతీసుకుంది. జిల్లా లో పీపీబీ, పట్టాదారు పాసుపుస్తకాల్లో ఎక్స్‌టెండ్ కరెక్షన్, పేర్ల తప్పొప్పులు, మ్యుటేషన్, కోర్టు కేసులు, సక్సేషన్ పీపీబీ, నాలా పీపీబీ, ఎల్ ఫారం, కాతా మెర్జింగ్ రిపోర్టు, సెమీ అర్బన్ ల్యాండ్స్, గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ వంటి కొన్నింటిని అధికారులు పరిష్కరించారు. జిల్లాలో అత్యధికంగా పట్టాదారు పాసుపుస్తకాల్లో సమస్యలు ఉన్నాయి. దీనికి సంబంధించి 14,909 దరఖాస్తులు ఉండగా 10,257 దరఖాస్తులను పరిష్కరించారు.

- ఖమ్మం జిల్లాలో ధరణి సమస్యల పరిష్కారం ఇలా :

- అందిన దరఖాస్తులు	78,710
- పరిష్కరించినవి:	57,101
- తిరస్కరించినవి:	13,269
- ఇంకా పరిష్కరించాల్సినవి:	8340

- ఆర్డీవోలు, తహసీల్దార్లకు లాగిన్ సౌకర్యం

ఇటీవలె కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ఆర్డీఓలు, తహసీల్దార్లకు లాగిన్ సౌకర్యాన్ని కల్పించారు. గతంలో ధరణి సమస్యలను పరిష్కరించే అధికారం కలెక్టర్లకు మాత్రమే ఉండేది.దీంతో కలెక్టర్‌కు పనిభారం ఉందని తలచి ఈ పరిష్కారానికి ఆర్డీవోలు, తహసీల్దార్లకు అప్పగించారు. ఈ నేపథ్యంలో జీఎల్ఎం, టీఎం-33, మిస్సింగ్ సర్వే నంబర్స్, విస్తీర్ణంలో తేడాలు, నిషేధిత జాబితా లోని భూములు, వారసత్వ భూములు, నాలా కన్వర్షన్, ఎన్నారైల భూములు, కోర్టు కేసుల్లోని భూములు తదితరాల సమస్యలను పరిష్కరించే బాధ్యతలను ఆర్డీఓలు, తహసీల్దార్లు అప్పగించారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

- వివిధ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలు ఇలా :

- తహసీల్దారు వద్ద	4,254
- ఆర్డీవోల వద్ద	1382
- అదనపు కలెక్టర్ వద్ద:	1356
- కలెక్టర్ లాగిన్‌లో	700

పుట్టగొడుగుల్లా..ప్లే స్కూల్స్

- కనీస ప్రమాణాలు పాటించని యాజమాన్యాలు
- చిన్నారుల భద్రతకు లేని భరోసా
- ఖమ్మం జిల్లాలో 40కి పైగా వెలసిన ప్లేస్కూల్స్
- పట్టించుకోని అధికారులు

ఖమ్మం ఖానాపురంహవేలి జూన్ 23: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి ప్లే స్కూల్స్. ఈ ప్లే స్కూల్స్‌కు విద్యాశాఖ నుంచి అనుమతులు తీసుకోకుండానే వీధికొక్కటి చొప్పున పుట్టుకొస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 40 వరకు ఈ ప్లే స్కూల్స్ నడుస్తున్నాయంటే, ఏ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారి ఆగడాలకు అంతులేకుండా పోయింది. ప్లే స్కూల్స్ యాజమాన్యాలు అడిగినంత ఫీజు చెల్లించాల్సిందే. అందులో చిన్నారుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై ఎటువంటి భరోసా కల్పిస్తున్నారో వారు చెప్పరు, తల్లితండ్రులు అడగరు. ఒక్కో పాఠశాలల్లో సుమారు 50 నుంచి 60 మంది చిన్నారులను చేర్చుకొని వారి ఆలనా, పాలనను చూ సేందుకు కేవలం ఇద్దరినో, ముగ్గురినో ఆయమ్మలను నియమించి, కనీస విద్యా అర్హతలు లేని వారితో చిన్నారులకు బోధన నేర్పిస్తుంటారనే వాదనలు వినపడుతున్నాయి. పసిబిడ్డలకు అందించే సౌకర్యాలు, విద్యపై ట్రాక్ చేయడానికి, నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ నిబంధనల ప్రకారం ఈ ప్లే స్కూల్స్ నిర్వహించాల్సి ఉంటుంది. కాని ఉమ్మడి జిల్లాలో ఏ ఒక్క ప్లేస్కూల్స్‌లో ఈ నిబంధనలు ప్రకారం నడవడం లేదంటే యాజమాన్యాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 1 ఏప్రిల్, 2010 నుంచి అమలులోకి వచ్చిన ఉచిత నిర్బంధ విద్య కోసం పిల్లల హక్కు చట్టం కూడా బాల్య సంరక్షణకు సంబంధించినది. ప్లే-స్కూల్స్ ప్రారంభ విద్యకు చాలా అనువైందే కాని వాటి ప్రామాణ్యాలపై తల్లిండ్రులకు అనుమానాలు తీర్చే అధికారులు లేకపోవడంతో పిల్లలను ప్రమాదంలో ఉంచుతుంది. ఒక పిల్లవాడు మూడేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్నట్లయితే, వారు ప్లేస్కూల్‌లకు వెళ్లడం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ నిబంధనలకు విరుద్ధం. మూడు నుంచి ఆరేళ్ల లోపు మధ్య వయస్సు గల పిల్లలను చేర్చుకునే ప్లే స్కూల్‌లను నియంత్రించడానికి కమిషన్ మార్గదర్శకాన్ని రూపొందిస్తోంది.

నగరంలో 20కి పైగా ప్లేసూల్స్

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే నగరంలో కొత్త ప్లేస్కూళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ ప్లే స్కూల్స్‌కు జిల్లాలో ఏ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఏ శాఖ అధికారుల అనుమతులు లేకపోవడంతో నగరంలో దాదాపు 20కి పైగా ప్లే స్కూల్స్ నడుస్తున్నాయి. కొన్ని పాఠశాలలు తల్లిదండ్రులను ఆకర్షించేందుకు భవనాలకు రంగురంగుల బొమ్మలతో ఆకర్షిణీయంగా తీర్చిదిద్ది, అధిక రుసుము వసూలు చేస్తుంటే, కొన్ని పాఠశాలలు రద్దీగా ఉండే మార్గాల్లో పాత భవనాల్లో నడుస్తున్నాయి. ప్లేస్కూల్స్‌లో అడ్మిషన్ ఫీజుతో సహా అధిక మొత్తంలో రుసుము చేస్తున్నారే వాదనలు వినపడుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నడుస్తున్న పాఠశాలలకు ప్రచారం కల్పిస్తూ కొన్ని పాఠశాలలు అడ్మిషన్ ఫీజు రూ.10 వేలు వసూలు చేస్తున్నాయి. నెలవారీ రుసుము సుమారు రూ.6వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. ప్రతి ఏడాది అడ్మిషన్ ఫీజు వసూలు చేసే పాఠశాలలు ఉన్నాయి. ఇంకా, పాఠశాలలో సీసీ కెమెరాలు ఉన్నాయా లేదా పాఠశాలలు భద్రతలో లేకపోయినా భద్రత గురించి ఆలోచించకుండానే తల్లిదండ్రులు తమ పిల్లలను ఎటువంటి భద్రత లేని కొన్ని ప్లే స్కూల్స్‌లో చేర్పిస్తున్నారు. భద్రత గురించి ఎక్కువ శ్రద్ధ వహించే కొంతమంది తల్లిదండ్రుల అంతర్జాతీయ ప్రమాణాలున్న ప్లేస్కూల్‌లో అధిక ఫీజులు చెల్లించి చేర్పిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా పాఠశాలకు తప్పనిసరి సర్టిఫికేట్ గుర్తింపు ఉందో లేదో తనిఖీ చేయరు.

కానీ రంగురంగుల వాతావరణాన్ని చూస్తూ మోసపోతుంటారనే విమర్శలు వినపడుతున్నాయి. అంతేగాక, ప్లే స్కూల్స్‌లో భవనాలకు ఎన్‌వోసి ఉందా,లేదా అని చూడరు. ఇళ్ల వద్ద ఉన్న సింగిల్ రూమ్‌లలో కొన్ని పాఠశాలలు కూడా ఉన్నాయి, ఈ ప్లేస్కూల్స్ బయట బోర్డు ప్రదర్శించరు, కేవలం ఒక గదిలోనే పాఠశాలను నిర్వహిస్తుంటారు. ఫీజులు మాత్రం అధికంగానే వసూళ్లు చేస్తుంటారనే విమర్శలు వినపడుతున్నాయి.



గట్టయ్య సెంటర్‌లో పాత భవనంలో నిర్వహిస్తున్న ప్లేస్కూల్

ఎత్తైనా భవనాల్లో తరగతులు...

నగరంలోని బైపాస్, గట్టయ్య సెంటర్, గాంధీచౌక్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, రోటరీనగర్, మామిళ్ళగుడెం, రాపర్తినగర్, జయనగర్ కాలని, తదితర ప్రాంతాల్లో ఈ ప్లే స్కూల్స్ నడుస్తున్నాయి. కొన్ని స్కూల్స్‌లో చిన్నారుల భద్రతకు తల్లితండ్రులకు పాఠశాల యాజమాన్యాలు భరోసాని ఇస్తుండగా ఎక్కువ ప్లే స్కూల్స్ పాఠశాలలు పాత భవనాలు, అపార్ట్‌మెంట్‌లలో నాల్గో ఫ్లోర్, ఐదో ఫ్లోర్‌లలో చిన్నారులకు ప్లే స్కూల్స్ ఏర్పాటు చేసి చిన్నారుల భద్రతకు ఎటువంటి భరోసాని కల్పించడంలేదనే వాదనలు వినపడుతున్నాయి.

ప్లే స్కూల్స్‌లను కేవలం మెదటి ఫ్లోర్, గ్రౌండ్ ఫ్లోర్‌లలో ఏర్పాటు చేయాల్సి ఉండగా కొన్ని ప్లేస్కూల్స్ అపార్ట్‌మెంట్‌లలో మూడు, నాలుగు ఫ్లోర్‌లలో ఏర్పాటు చేసి చిన్నారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. ఈ ప్లే స్కూల్స్‌ను కూడ విద్యాశాఖ పరిధిలోకి తీసుకొచ్చి తప్పని సరిగా ప్రమణాలు పాటించే పాఠశాలలకే అనుమతులు మంజూరు చేసేల కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం నడుస్తున్న ప్లే స్కూల్స్ ను కలెక్టర్ తనిఖీలు చేసి ప్రమాణాలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలని పలువురు చిన్నారుల తల్లితండ్రులు కోరుతున్నారు.

నెరవేరని పద్మశ్రీ సకిని స్వప్నం

- ముందుకు సాగని గిరిజన సంప్రదాయ నృత్య పాఠశాల
- 2022 నుంచి నిధులు కేటాయించని అప్పటి ప్రభుత్వం
- ఆయన గౌరవ వేతనమూ మరిచిన వైనం
- రామచంద్రయ్య మృతితో విషాదంలో భద్రాద్రి ఏజెన్సీ

భద్రాచలం, జూన్ 23: అంతరించిపోతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు భ ద్రాచలంలో గిరిజన నృత్య పాఠశాల ఏర్పాటు చేసి దాని కార్యకలాపాలను వేగవంతం చేయాలన్న ఆయన కల నెరవేరకుండానే ఆయన దివికేగారు. పద్మశ్రీ సకిని రామచంద్రయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందడంతో భద్రాద్రి ఏజెన్సీలో విషాదం అలుముకుంది. రామచంద్రయ్య 12 ఏళ్ల వయస్సులోనే డోలి కళపై మక్కువ పెంచుకొని అందులో నిష్ణాతులుగా నిలిచారు. కంచుతాళం, మేళం చేతపట్టి కాళ్లకు గజ్జె కట్టి డోలి వాయిస్తూ కోయల పుట్టు పూర్వోత్తరాలను పాటల రూపంలో వివరించే వారు. తెలుగు, కోయ భాషల్లో కథలు చెప్పడంలో ఆయన దిట్ట. డోలు వాయిద్యంతో దైవ కార్యాలు, జాతరలు, ఆదివాసీ పండగలు, వివాహాది శుభకార్యాల వద్ద తన జ్వరని విని పిస్తూ ఆహుతులను ఆనంద డోలికల్లో ముంచెత్తేవారు. రెండేళ్లకోసారి నిర్వహించే మేడారం జాతరకు గత 50 ఏళ్లుగా వెళ్లి డోలి వాయిద్యం వాయిస్తున్నారు. ఇదిలా ఉండగా రామచంద్రయ్య మృతి పట్ల భద్రాద్రి ఏజెన్సీలోని గిరిజన సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి తమప్రగాడ సానుభూతిని తెలిపారు.

తొలి నుంచి ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల పట్ల మక్కువ చూపిన ఆయనకు భారత ప్రభుత్వం 2022లో పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేయగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ సకిని రామచద్రయ్యకు పద్మశ్రీని ప్రదానం చేశారు. ఈ క్రమంలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని విద్యా సంస్థల్లో అంతరిచిపోతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం కోసం 2022 మార్చి 29న ట్రైబల్ కల్చర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(టీసీఆర్ఎన్‌టీఐ) రీజినల్ సెంటర్‌లో గిరిజన నృత్య పాఠశాలను ఏర్పాటు చేయాలని అప్పటి ఐటీడీఏ పీవో పోట్రుగౌతమ్ సంకల్పించారు. ఈ క్రమంలో ఆ పాఠశాలకు చీఫ్ డ్యాన్స్ మాష్టర్‌గా సకిని రామచంద్రయ్యను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. 2022 జూన్ నుంచి 2023 మార్చి వరకు పది నెలల పాటు ప్రతి నెల రూ.20 వేలు గౌరవ వేతనం ఆయనకు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆయన పదవీకాలం ముగిసి ఏడాది దాటినా ఇంకా గిరిజన సంప్రదాయ నృత్య పాఠశాల కార్యకలాపాలు ముందుకు సాగలేదన్నది అక్షరసత్యమని ఆదివాసీ సంఘాల నాయకులే వాపోతున్నారు. అంతే కాదు చీఫ్ డ్యాన్స్ మాస్టర్‌గా రామచంద్రయ్యకు ఇస్తామన్న గౌరవ వేతనం రూ.2.40 లక్షల చెల్లించ లేదని సమాచారం. అదేవిధంగా పద్మశ్రీతో భారత ప్రభుత్వం రామచంద్రయ్యను గుర్తించి సముచితంగా సత్కరించగా అప్పటి ప్రభుత్వం ఇస్తామన్న రూ.కోటి పారితోషకం ఆయనకు అందలేదని తెలిసింది. ఇదిలా ఉండగా సంస్కృతి సంప్రదాయాలు అంతరించిపోకుండా నృత్యపాఠశాల కార్యకలాపాలు వెంటనే ప్రారంభించాలని ఆయన పలుమార్లు అప్పటి ప్రభుత్వానికి అధికారులకు మొరపెట్టుకున్నా అది కార్యరూపం దాల్చకపోవడం శోచనీయమని గిరిజన సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.



గిరిజన నృత్య పాఠశాల చీఫ్ డ్యాన్స్ మాస్టర్‌గా నియామకపు పత్రం అందజేస్తున్న అప్పటి పీవో పోట్రు గౌతమ్(ఫైల్)

ముంపునకు గురైన పర్ణశాల నారచీరలు



మునిగిన సీతమ్మవారి విగ్రహం



ముంపునకు గురైన నారచీరలు దృశ్యం

దుమ్ముగూడెం జూన్ 23: ఎగువన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల వద్ద నారచీరల ప్రాంతం ఆదివారం ముంపుకు లోనైంది. సీతవాగు పొంగిపొర్లడంతో నారచీరల ప్రాంతంలోని సీతమ్మవారి విగ్రహం, నారచీరల ప్రాంతానికి వెళ్లే ఫుట్ బ్రిడ్జిలు మునిగిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో యాత్రికుల సందర్శనను నిలిపివేశారు. దీంతో భక్తులు నిరాశగా వెనుదిరిగారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఆళ్లపల్లి, జూన్ 23: టేకులపల్లి మండలం, బోడు గ్రామానికి చెందిన కుంజ రాజేంద్రప్రసాద్ మండల పరిధిలోని అనంతోగు కేజీబీవి పాఠశాలలో బంధువుల దగ్గరకు వచ్చి తిరిగి బైక్‌పై వెళుతున్న క్రమంలో అనంతోగు-కాచనపల్లి మార్గ మధ్యలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని 108 సహాయంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

డీఎం, పీఎం నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

▸ టీజీఎఫ్‌డీసీ సీజీఎఫ్, ఆర్ఎం బీ.వెంకటేశ్వరరెడ్డి



భవనాలను పరిశీలిస్తున్న టీజీఎఫ్‌డీసీ సీజీఎఫ్, ఆర్ఎం వెంకటేశ్వరరెడ్డి

సత్తుపల్లి, జూన్23: సత్తుపల్లి అటవీ కార్పొరేషన్ పరిధిలో రూ.1.37కోట్ల అంచనా వ్యయంతో నిర్మితమవుతున్న డీఎం, పీఎం కార్యాలయాలు, క్వార్టర్స్ నిర్మాణాలను 15రోజుల్లోగా పూర్తి చేసి, ప్రారంభించాలని టీజీఎఫ్‌డీసీ ఎస్ఎఫ్ఎస్ రీజినల్ మేనేజర్, చీఫ్ జనరల్ మేనేజర్ డీ.వెంకటేశ్వరరెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన సత్తుపల్లిలో ఆకస్మికంగా పర్యటించి టింబర్ డిపోతో పాటు నిర్మాణంలో ఉన్న భవనాల సముదాయాలను పరిశీలించారు. 2022లో శంకుస్థాపన చేసిన ఈ భవనాల నిర్మాణాలు ఇంకా పూర్తికాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రెండేళ్లు కావస్తున్నా చివరి దశకు రాకపోవడంపై అధికారులను ప్రశ్నిస్తూ నిర్మాణంలో గదుల కూర్పు, వసతులపై పలు సూచనలు చేశారు. నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడంతో పాటు త్వరితగతిన అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తాగునీటి విషయంలో మిషన్ భగీరథ అనుమతులు ముందుగానే తీసుకోవాలని, విద్యుత్ సమస్యతో పాటు పలు శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని అక్కడున్న పీఎం సైదానాయక్‌ను ఆదేశించారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్తుపల్లి టింబర్ డిపోలో గతేడాది రూ.28లక్షల బాంబూను విక్రయించామని, ప్రతి ఏడాది 26బాంబూ విక్రయాల లక్ష్యంగా ఇప్పటికే 36బాంబూ విక్రయించి లక్ష్యాలను అధిగమించామన్నారు. లక్ష్యాన్ని మించి బాంబూ విక్రయాలు జరుగుతున్నాయని, మంచి ఆదరణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎం గణేష్, పీఎంలు సైదానాయక్, డీపీఎంలు కవిత, వీ.నాగలక్ష్మి పాల్గొన్నారు.

దుప్పిని కాపాడిన ఎమ్మెల్యే రాగమయి

▸ పార్క్ నుంచి తప్పిపోయి గాయపడిన వచ్చిన చుక్కల దుప్పి



చుక్కల దుప్పికి వైద్యం చేయిస్తున్న ఎమ్మెల్యే డా.రాగమయి

సత్తుపల్లిరూరల్, జూన్23: నీలాద్రి అర్బన్ పార్క్‌కు ఆనుకొని ఉన్న జలగం నగర్ మీదుగా ఓ చుక్కల దుప్పి తీవ్రంగా గాయపడి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లోపలికి చేరింది. గమనించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ వెంటనే ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సమాచారం ఇవ్వగా హుటాహుటీనా అక్కడికి చేరుకున్న ఆమె వెటర్నరీ వైద్యులు, అటవీ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికక్కడే వైద్యం అందించడంతో అటవీ అధికారులు తమ వాహనంలో నీలాద్రి అర్బన్ పార్క్‌కు తీసుకెళ్లి సపర్యలు చేసిన అనంతరం వదిలేశారు. చుక్కల దుప్పి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని, చింతిచాల్సిన అవసరం లేదని, తమకు సమాచారం ఇచ్చిన జీవాన్ని బతికించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే రాగమయికి ఎఫ్‌బీవో ముక్తి వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు.

23కేజీల అడవి పందిమాంసం స్వాధీనం

▸ చొప్పకట్లపాలెంలో విక్రయిస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులు

మధిర, జూన్ 23: అడవి పంది మాంసం విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను ఫారెస్ట్ అధికారులు మధిర ఫారెస్ట్ రేంజి పరిధిలోని బోనకల్ మండలం చొప్పకట్లపాలెంలో ఆదివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 23కిలోల అడవి పంది మాంసం స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మధిరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకాని మండలానికి చెందిన వెంకన్న, బోనకల్ మండలం చిరునోముల గ్రామానికి చెందిన మొగిలి అద్దయ్య అడవి పందిని కొనుగోలు చేసి, చొప్పకట్లపాలెం శివారులో ముక్కలుగా కట్‌చేసి ఆదివారం విక్రయిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులకు సమాచారం రావడంతో వెంటనే వెళ్లి అడవిపంది మాంసం చట్టవిరుద్ధంగా అమ్ముతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 35కిలోల పంది మాంసం కట్ చేసి కుప్పలుగా పెట్టి అమ్ముతుండగా పట్టుకున్నారు. అప్పటికే కొంత అమ్మగా 23కేజీలు స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. వీరిపై అటవీ సంరక్షణ చట్టం కేసునమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. స్వాధీనం చేసుకొన్న మాంసం వెంటనే కాల్చివేసి దగ్ధం చేశారు. ఈసమావేశంలో డిప్యూటీ ఆర్వో వెంకటలక్ష్మీ, బోనకల్ ఎఫ్‌బీవో సూరిబాబు, విజయ్, సురేష్, రాజేందర్, ఉపేంద్రయ్య, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



పట్టుబడిన అడవి పందిమాంసం, నిందితులతో ఫారెస్ట్ అధికారులు

అడవి పందికి గాయం..

▸ అడవిలో వదిలిన అటవీశాఖ అధికారులు

కామేపల్లి, జూన్ 23: కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామ సమీపంలో అడవి పంది గాయపడి ఉండడంతో అదే గ్రామనికి చెందిన కొందరు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు గాయపడిన పందిని కారేపల్లి వెటర్నిటి డాక్టర్‌తో చికిత్స చేయించారు. చికిత్స అనంతరం ముచ్చర్ల రిజర్వ్ ఫారెస్ట్ 4వ నెంబర్ కంపార్ట్‌మెంట్‌లో వదిలారు. ఈ సంఘటనలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ చక్రవర్తి, బీట్ ఆఫీసర్లు నాగరాజు, వి.నాగరాజు, అఫ్జల్ తదితరులు ఉన్నారు.

అటకపైకా.. ఆచరణలోకా..?

▸ ఇల్లెందు నియోజకవర్గానికి బీఆర్ఎస్ సర్కారు హయాంలో పలు అభివృద్ధి పనుల మంజూరు

▸ ప్రస్తుత సర్కారులో వాటి పరిస్థితి అగమ్యగోచరం ▸ ఆందోళనలో నియోజకవర్గ ప్రజానీకం

ఇల్లెందు, జూన్ 23: శాసనసభ ఎన్నికలకు ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లెందు నియోజకవర్గానికి మంజూరు చేసిన అభివృద్ధి పనుల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. ఎన్నికల ఏడాదిలో ఇల్లెందు నియోజకవర్గంలోని గార్ల మండలంలో రాంపురం వెళ్లే మార్గంలో పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని రూ.23 కోట్ల వ్యయంతో మంజూరు చేస్తూ పాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేశారు. గార్ల మండల కేంద్రం నుంచి రాంపురం తదితర ఏజెన్సీ గ్రామాల ప్రజల రాకపోకలకు పాకాల ఏరు పొంగిప్రవహిస్తుండటం, పలువురు ఏరు దాటుతూ మృత్యువాత పడుతుండటంతో పాకాల ఏటిపై హైలెవల్ బ్రిడ్జిని గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన సైతం చేశారు. శిలాఫలకం వేసినప్పటికి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఇల్లెందు నియోజకర్గంలో సైతం కాంగ్రెస్ విజయం సాధించింది. అసెం బ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ శాసనమండలి ఎన్నికల్లో సైతం నియోజకవర్గం ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థులకే పట్టం కట్టారు. అయితే ఎన్నికలు జరిగి ఆరు నెలలు దాటినా రాంపురం బ్రిడ్జి నిర్మాణం ఊసు మాత్రం ప్రజాప్రతినిధులు ఎత్తడం లేదు. ఆరు నెలలుగా రాంపురం బ్రిడ్జి గురించి ఎవరు పట్టించుకోకపోవడంతో అసలు ఈ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందా.. లేదా.. అన్న సంశయం వ్యక్తమవుతుంది.



శిలాఫలకానికే పరిమితమైన విద్యుత్ సబ్‌స్టేషన్-లలితాపురం రోడ్డు విస్తరణ

ఎన్నికలకు ముందు గతంలో జరిగిన శంకుస్థాపనలు గత పాలకులతో పాటు కనుమరుగు అయినట్లేనా అన్న చర్చ నియోజకవర్గంలో సాగుతుంది.

ఊసేలేని సీతారామ ప్రాజెక్టు..

సాక్షాత్తూ గత సీఎం కేసీఆర్ 2016 ఫిబ్రవరి 16న ఇల్లెందు నియోజకవర్గం టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఇల్లెందు నియోజకవర్గాన్ని సస్యశామలం చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఎనిమిదేళ్లు కావొస్తున్నా ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు అతిగతి లేకుండా పోయింది. ఏజెన్సీ మండలాలతో కూడిన ఇల్లెందు నియోజకవర్గానికి దశాబ్దాలు గడుస్తున్నా శాశ్వత సాగునీటి వనరులు ఏ ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేదు. గార్ల, బయ్యారం, ఇల్లెందు, కామేపల్లి, టేకులపల్లి మండలాలతో పాటు డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీతారామ ప్రాజెక్టు రెండోవ దశ రీ డిజైనింగ్‌కు గత ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రూ.3,200 కోట్ల వ్యయంతో గత ఏడాది ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులు డీపీఆర్ రూపొందించడంతో గత ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ఫైనాన్స్ విభాగంలో క్లియరెన్స్ రానునందని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో ప్రచారం కూడా చేశారు.

కాని ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన డీపీఆర్ అటకెక్కినట్లు అయింది. ఇటీవల రాష్ట్ర మంత్రులు ప్రాజెక్టు సందర్శనలో సైతం ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టుపై స్పష్టత రాకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ ప్రతిపాదనలు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడంతో ఇల్లెందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు లభిస్తుందో.. లేదో.. తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది. అదే విధంగా పట్టణంలో సైతం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన, ఉత్తర్వులు జారీ చేసిన, శంకుస్థాపనలు చేసిన అనేక పథకాలు శిలాఫలకాలకే పరిమితం అయ్యాయి. గత ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలు నూతన ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు దాటుతున్నా వాటి భవితవ్యంపై స్పష్టత ఇవ్వకపోడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

అదే విధంగా పట్టణంలోని కరెంట్ ఆఫీస్ సెంటర్ నుంచి లలితాపురం వరకు గత ఏడాది సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణం, బీటీ రోడ్ విస్తరణ నిర్మాణాలకు గత ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఈ మేరకు అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా శంకుస్థాపనలు కూడా చేశారు. కానీ 10 నెలలు కావొస్తున్నా పనులు ప్రారంభం కాలేదు.

ఉనికిలేని ప్రభుత్వ ఐటీఐ

ఇల్లెందు నియోజకవర్గంలో ఏజెన్సీ ప్రాంతాల విద్యార్థులకు సాంకేతిక విద్యావకాశాలు అందించాలన్న యోచనతో ఎన్నికలకు ముందు ఇల్లెందులో ప్రభుత్వ ఐటీఐని మంజూరు చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఐటీఐ భవనాల నిర్మాణానికి 2023 ఆగస్టు నెలలో రూ.11.53 కోట్లు మంజూరు చేస్తూ పాలనపరమైన ఉత్తర్వులు కూడా జారీ చేశారు. అయితే ఉత్తర్వులు జారీ చేసి ఏడాది కావొస్తున్నా ఇల్లెందులో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికి రాష్ట్ర వ్యాప్తంగా ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియలు ప్రారంభమైనప్పటికీ, ఇల్లెందు ఐటీఐ గురించి అటు ప్రభుత్వం గాని, సాంకేతిక విద్యాశాఖా అధికారుల గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదన్న ఆవేదన వ్యక్తం అవుతుంది.

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇల్లెందు ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్లు జరుగుతా.. లేదా.. అన్న సంశయం నెలకొన్నది.

ఉలుకులేని వంద పడకల ఆస్పత్రి

అదే విధంగా ఇల్లెందు పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ వైద్యశాలను, గార్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను 100 పడకల స్థాయి ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాక ఇల్లెందులో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి రూ.37.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. అందుకు అనుగుణంగా గతంలోనే 100 పడకల ఆస్పత్రి స్థాయికి అవసరమైన నర్సులను సైతం నియామకం జరిపారు. కానీ 100 పడకల భవన సముదాయ ల నిర్మాణాల గురించి మాత్రం ఎన్నికల పిదప ఎవరు నోరు మెదపడం లేదు. ఈ ఉత్తర్వులు నూతన ప్రభుత్వ పాలనలో మనుగడలో ఉన్నట్లా.. లేనట్లా.. 100 పడకల ఆస్పత్రి నిర్మాణం జరుగుతుందా.. లేదా.. బోధపడని పరిస్థితి నెలకొన్నది.



30 పడకలకే పరిమితమైన ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో మరో చీలిక

▸ ప్రజాసంఘాలపై పట్టుకోసం ఇరువర్గాల యత్నాలు

ఇల్లెందు, జూన్ 23: నాలుగున్నర దశాబ్దాల పాటు సాయుధ పోరాటం పార్లమెంటరీ పంథాలతో జోడి స్వారీ చేసిన సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీలో మరో పర్యాయం చీలిక సంభవించింది. భూమి భుక్తి, విముక్తి పోరాటాలతో రాష్ట్రంలో ప్రజా బాహుళ్యంలో గట్టి ప్రాబల్యం కలిగిన న్యూడెమోక్రసీ గడిచిన పదేళ్లకాలంలో నాలుగు ముక్కలుగా చీలిపోవడం గమనార్హం. తాజాగా పాతూరి నారాయణ స్వామి అలియాస్ చంద్రన్న కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్న న్యూడెమోక్రసీలో గత రెండేళ్లుగా జరుగుతున్న అంతర్గత విబేధాలు, ఉద్యమ నిర్మాణాలు ఉల్లంఘనులు, అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడం, రాజకీయ ఎత్తుగడల్లో తలెత్తిన విబేధాలు, గుంటూరులో పార్టీకి చెందిన ఒకరి హత్య ఘటనలు చిలికి చిలికి గాలివానగా మారి పార్టీలో చీలికకు కారణమైనట్లు తెలిసింది.

కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఉన్న చంద్రన్న నాయకత్వాన్ని విబేధిస్తూ సెంట్రల్ కమిటీ నాయకుడు సాధినేని వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరో కమిటీని ఏర్పాటు చేయడం, ప్రజా సంఘాలపై పట్టుకోసం ఇరువర్గాలు పోటాపోటీగా సభలు, సదస్సులు నిర్వహించడం పరస్పరం నిందారోపణలు, బహిష్కరణలకు పూనుకుంటున్న పరిణామాలు ఆపార్టీ చీలికను ధ్రువపరిచాయి. ఏకంగా ఎన్డీ సెంట్రల్ కమిటీ నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, చిట్టిపాటి వెంకేశ్వర్లును పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు కార్యదర్శి చంద్రన్న ప్రకటించడంతో ఎన్డీలో నాలుగో పర్యాయం చీలిక సంభవించినట్లయ్యింది. ఈక్రమంలో కార్యదర్శి చంద్రన్న విధానాలను వ్యతిరేకిస్తున్న వివిధ రాష్ట్రాల ఎన్డీ నాయకులు ప్లీనం నిర్వహించి ఎన్డీ నూతన కేంద్ర కమిటీ కార్యదర్శిగా సాధినేని వెంకటేశ్వరరావును ఎన్నుకున్నట్లు, చంద్రన్న పార్టీ కార్యదర్శిగా వ్యవహరించే అర్హత లేదంటూ ప్రకటించడంతో ఎన్డీ చీలిక ధ్రువపడింది. ఈపరిణామాలతో ఇరువర్గాలు తమ పార్టీ ప్రాబల్యం కలిగిన ప్రాంతాల్లో నాయకులను, క్యాడర్‌ను తమవైపు తిప్పుకునేందుకు అనుబంధ, ప్రజాసంఘాలపై పట్టుకోసం తీవ్రస్థాయిలో యత్నాలు చేపట్టాయి. ఉద్యమ ప్రాంతాలను కాపాడుకునేందుకు శక్తియుక్తులు దారపోస్తున్నాయి.

విశ్వసనీయంగా అందిన సమాచారం ప్రకారం ప్రస్తుతం చంద్రన్న నాయకత్వంలోని ఎన్డీలో వివిధ రాష్ట్రాలకు చెందిన గామల్, భాస్కర్, టాన్యా, యాదన్న, సాంబశివుడు, ఆరెల్లి కృష్ణ, విశ్వనాథ్, తెలంగాణ కార్యదర్శి అశోక్, వరదయ్య, రాంసింగ్ , సాంబ తదితరులున్నారు.

కాగా సాధినేని వెంకటేశ్వరరావు కార్యదర్శిగా ఎన్నికైన ఎన్డీలో చిట్టిపాటి వెంకటేశ్వరుల, గోవర్ధన్, సంధ్య, సాగర్, ఎం.శ్రీనివాస్, అనురాధం, గౌని అయియల్య, జె.సీతారామయ్య, రామన్న, గోపి, రాసుద్దీన్ తదితరులునట్లు సమాచారం. పార్టీలో సంభవించిన చీలిక మూలంగా ఇఫ్టూ, పీడీఎస్‌యూ, ఏఐకేఎంఎస్, పీవైఎల్, పీవోడబ్ల్యూయూ తదితర అనుబంధ సంఘాలపై పట్టుకోసం ఇరువర్గాలు హోరాహోరీగా యత్నిస్తున్నాయి. పోటాపోటీగా సదస్సులు, కౌన్సిల్ సమావేశాలు, నిర్వహిస్తు పట్టుకోసం వ్యూహ ప్రతివ్యూహాల్లో నిమగ్నయ్యాయి.

చోరీకి వచ్చి పట్టుబడ్డ దొంగ

● పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు



దొంగను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఇల్లెందురూరల్, జూన్ 23: చోరీకి వచ్చి ఓ మోస్ట్ వాంటెడ్ దొంగ గ్రామస్థులకు పట్టుబడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇల్లెందు మండలం ఇందిరానగర్ గ్రామానికి చెందిన గుగులోత్ రంజిత్ మండంలోని నిజాంపేట గ్రామంలో శనివారం అర్ధరాత్రి బర్ల వీరన్న అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం చేయడానికి వచ్చి గ్రామస్థులకు పట్టుబడ్డాడు. తాను నక్సలైట్‌నని, ఎవ్వరన్న దగ్గరకు వస్తే చంపేస్తానని గ్రామస్థులను ప్రతిఘటించేందుకు ప్రయత్నించగా, గ్రామస్థులందరూ దొంగను చుట్టుముట్టి పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. కాగా గ్రామస్థులకు పట్టుబడిన దొంగ ఇల్లెందు పట్టణంతో పా టు ఉమ్మడి జిల్లాలో అనేక గ్రామాల్లో చోరీలకు పాల్పడి రెండేళ్లుగా మోస్ట్ వాంటెడ్ దొంగగా పేరు మోసిన వ్యక్తి అని పోలీసులు తెలిపారు.

మొండికుంటలో చోరీ

▸ రూ.50వేల నగదు అపహరణ

అశ్వాపురం జూన్ 23: మొండికుంటలోని ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన మాదిరెడ్డి వెంకటరెడ్డి ఇంట్లో బైక్ మెకానిక్ శివ అద్దెకు ఉంటున్నాడు. ఈనేపథ్యంలో శివ కుటుంబ సభ్యులు ఊరు వెళ్లడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగుల కొట్టి బీరువాలో ఉన్న రూ.50వేల నగదు అపహరించారు. స్థానికుల మేరకు ఊరి నుంచి వచ్చిన అతడికి చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సందర్శించి వివరాలు సేకరించారు.

మండల పరిధిలోని సర్వయ్యగుంపునకు చెందిన ఓ పత్రికా విలేకరి బచ్చలకూరి వెంకట్ రోజు లాగానే తన బైక్‌ను ఇంటి ముందుంచాడు. ఆదివారం ఉదయం చూసేసరికి బైక్ కన్పించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఖమ్మం క్రైం,జూన్23: మామిళ్లగూడెంలో నివసించే పి.ప్రసాద్ తన కుటుంబంతో కలిసి గత వారం రోజుల క్రితం రాజస్థాన్ టూర్‌కు వెళ్లారు. ఆదివారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొటి ఉన్నాయి. ఇంట్లోని రూ.40వేలు విలవ చేసే సోత్తు చోరీ జరిగినట్టు తెలిసింది.

రామచంద్రాపురంలో యువకుడిపై దాడి

● ఆస్పత్రికి తరలింపు

జూలూరుపాడు, జూన్ 23: ఓ యువకుడిపై బ్లైడ్‌తో మరో యువకుడు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి రామచంద్రాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం గ్రామానికి చెందిన తాటి వైష్ణవికి ఐదేళ్ల క్రితం టేకులపల్లి మండలం రామచంద్రునిపేటకి చెందిన చింతల కుమారస్వామితో వివాహం జరిగింది. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి సంసారం కొన్నేళ్ల పాటు సాఫీగానే సాగింది.

ఇటీవల భర్త వేధింపులు తట్టుకోలేక పిల్లలను తీసుకోని భార్య వైష్ణవి 5 నెలల క్రితం రామచంద్రాపురం గ్రామానికి వచ్చి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో కుమారస్వామి తన భార్యను తీసుకువెళ్లేందుకు పెద్దమనుషులను తీసుకొని రామచంద్రాపురానికి వచ్చాడు. కాగా గ్రామంలో ఇరువర్గాలకు చెందిన పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహిస్తుండగా, కుమారస్వామి భార్యతో ఘర్షణకు దిగాడు. ఆమెను కొట్టేందుకు ప్రయత్నిస్తుండటంతో గ్రామానికి చెందిన సరెం నాగరాజు అడ్డుకోబోయాడు. కుమారస్వామి వెంట తెచ్చుకున్న సర్జకల్ బ్లేడుతో నాగరాజు మెడమీద కోశాడు. ఈ సంఘటనలో నాగరాజు మెడపై గాయమైంది. గ్రామస్థులు సంఘటన స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన యువకుడు పారిపోకుండా బందీంచారు. జరిగిన సంఘటనపై గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీవ్రంగా గాయపడిన యువకుడిని కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ సందర్శించి వివరాలను సేకరించారు.

WALK - IN - INTERVIEW
ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేయుటకు నిరుద్యోగ యువకులకోసం ఈ క్రింది ఉద్యోగ అవకాశాలు కలవు. కాబట్టి అర్హత కలవారు ఇంటర్వ్యూలలకు హాజరుకాగలరు.
ఆంధ్రజ్యోతి
అసిస్టెంట్ సర్క్యులేషన్ ఆఫీసర్ (ACO)
భద్రాచలం
డివిజన్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ (SR's)
సత్తుపల్లి, ఖమ్మం, మధిర,
అభ్యర్థి తన డివిజన్ పరిధిలోని ఏజెంట్లను, సేల్స్ టీమ్స్‌ను కో-ఆర్డినేషన్ చేస్తూ మంచి రిజల్ట్ వచ్చేవిధంగా పని చేయవలసి ఉంటుంది. అభ్యర్థి కనీస అర్హతఇంటర్‌మరియు సేల్స్ రంగంపై ఆసక్తి కలిగి ఉండవలెను. అర్హత, అనుభవాన్ని బట్టి వేతనం నిర్ణయించబడును. పై అర్హతలు గల అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగలరు
ఇంటర్వ్యూ తేది:
25-06-2024 ఉ॥ 10:00 నుండి మ॥ 2 గంటలు వరకు
ఇంటర్వ్యూ స్థలము : సర్క్యులేషన్ మేనేజర్
ఆంధ్రజ్యోతి కార్యాలయం.
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్. ప్లాట్స్ నెం: 112,
ఇండస్ట్రియల్ ఏరియా ఖానాపురం హావేలి,
శ్రీ అభయ వేంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, ఖమ్మం
సెల్: 9985411350

ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి

▸ ఈ ఏడాదిలో 225 మైనర్ డ్రైవింగ్

▸ 4094 ర్యాష్/స్పీడ్ డ్రైవింగ్ కేసుల నమోదు

▸ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు



పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మం క్రైం, జూన్ 23: ర్యాష్, మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక దృష్టి పెట్టామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో ఆదివారం ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ముఖ్యకారణం మద్యం మత్తులో వాహనాలు నడపడం ఒకటైతే, మరొకటి ర్యాష్ డ్రైవింగ్ అని అన్నారు. ఈ డ్రైవ్‌లు ఇంకా కొన సాగుతాయని నిందితులు అతిక్రమించి తరచూ ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా లైసెన్స్, నంబర్ ప్లేట్ నంబర్ సక్రమంగా లేని, నంబర్ ట్యాంపరింగ్ కలిగిన, నంబర్ తుడిపివేసిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ర్యాష్ డ్రైవింగ్‌లో ఎక్కువగా మైనర్లు అధికసంఖ్యలో పట్టుబడుతున్నారని తెలిపారు. పట్టుబడిన వాహనాలపై ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

విపరీతమైన శబ్దాలు చేస్తూ తిరిగే 80 బుల్లెట్ వాహనాల యొక్క సైలెన్సర్లు తొలగించటం జరిగింది.

ఖమ్మం ట్రాఫిక్ పీఎస్‌లో....

జనవరి 2024 నుంచి ఇప్పటి వరకు నమోదైన కేసులు.

కేసుల పేరు	సంఖ్య	జరిమానా
కాంటాక్ట్ కేసులు	2,641	రూ.20,96,500
నాన్ కాంటాక్ట్, కెమెరా:	32,122	రూ.76,69,370
లేజర్ గన్:	4093	రూ.42,362,55
క్రేన్ కేసులు:	1358	రూ.4,38,200
సీసీ కెమెరాల(ఇంటిలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం)ద్వారా	3,583	రూ. 4,38,200
అతివేగముగా వాహనం నడపడం	4094,	రూ.40,94,000
డ్రంకెన్‌డ్రైవ్:	225	రూ.1,12,500
ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం	547,	రూ.5,47,000
సిగ్నల్ జంపింగ్	287	రూ. 2,87,000
హెల్మెట్ ధరించకుండా	28,088	రూ. 41,96,700
రాంగ్ సైడ్ డ్రైవింగ్	881	రూ.2,00,200
త్రిబుల్ రైడింగ్	993	రూ.11,26,800
నెంబర్ ప్లేట్ సరిగ్గాలేనివి	1087	రూ.2,17,400

తల్లీకుమారుడి ఆత్మహత్యాయత్నం

● సువర్ణాపురం గ్రామంలో ఘటన

ఖమ్మం క్రైం/ముదిగొండ, జూన్ 23: పోలీసుల విచారణకు హాజరయ్యేందుకు వెళ్తూ పురుగుల మందు తాగి తల్లీ కుమారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ముదిగొండ మండలం సువర్ణాపురం గ్రామరెవెన్యూ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలెం మండలం, చిమ్మపుడి గ్రామానికి చెందిన కణతాల నర్సమ్మ, అమె కుమారుడు శేషగిరి ముదిగొండ మండలం, సువర్ణాపురం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఇటీవల నగరంలోని శ్రీరామ్ నగర్‌లో జరిగిన ఓ చోరీ కేసు విషయమై శేషగిరి బంధువు లలిత అను మహిళను ఖమ్మం అర్బన్ పోలీసులు విచారణకు పిలిచారు. తరువాత శేషగిరిను కూడా శనివారం విచారణకు పిలవగా పోలీస్ స్టేషన్‌లో హాజరైయ్యాడు. ఆదివారం కూడా పోలీస్ స్టేషన్‌కు రావాల్సి ఉండగా, తల్లితో కలిసి స్టేషన్‌కు బయలుదేరారు. అయితే స్టేషన్‌కు రాకుండా సువర్ణార రరతపురం వెళ్లి అక్కడ ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వారిని నగరంలోని ఓఆసుపత్రికి తరలించినట్టు సమాచారం. కాగా అప్పుల బాధతో ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్టు వారు చెబుతున్నట్టు తెలిసింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి


ఖమ్మం రూరల్, జూన్ 23: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కాచిరాజుగూడెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు అదంకి పెద్ద వెంకన్న(60) తన వరిపోలంలో నారు పోసేందుకు వెళ్లి, మోటార్ ఆన్ చేయగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుంటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్
రియల్ఎస్టేట్
పాల్వంచ కలెక్టరేట్, ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అతి దగ్గరలో ఎకరం, అర ఎకరం, రిజిస్ట్రేషన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ అమ్మకమునకు కలవు. సంప్ర: 9988923999,9177991489
AJM-187524
EDUCATION
★ Study MBBS Abroad, Pursue MBBS at top rated Universities in Russia, Georgia, Vietnam, Kazakhstan & Uzbekistan @ Low fee, MCI & Global recognized: Contact : JASS OVERSEAS CONSULTANTS, Warangal, Phone: 8247533298
AJH-0354
పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ
స్వదేశాగమనము/ విదేశీయానం, పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవం, షష్టిపూర్తి, లీగల్ నోటీసులు, శ్రద్ధాంజలి, పదవీవిరమణ
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
ఖమ్మం : 9985401672
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

కోల్‌బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలని ఆందోళన

ఇల్లెందు టౌన్, జూన్ 23: బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ వారికి కేటాయించకుండా సింగరేణి యాజమాన్యానికే అప్పగించాలని కోరుతూ ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఇల్లెందులోని సోలార్‌ప్లాంట్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి అబ్బాస్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణను వేగవంతం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర బొగ్గుగనుల మంత్రి కిషన్ రెడ్డి దేశంలో ఉన్న 60 బొగ్గుబ్లాక్‌లతోపాటు సింగరేణి బొగ్గుబ్లాక్‌లను వేలం వేయడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో 8 పార్లమెంట్ స్థానాలు గెలుచుకుని తాము ఏం చేసిన ప్రజల మద్దతు తమకే ఉందని బీజేపీ మంత్రులు, ఎంపీలు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రేమ్‌సింగ్, శంకర్, ఫిరాజ్ అహ్మద్, మహ్మద్, లక్ష్మణ్, రాము, పవన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భద్రాద్రి
కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
6
సోమవారం 24 ఏప్రిల్ 2024

జూలూరుపాడులో ట్రాఫిక్ అస్తవ్యస్తం

నియంత్రణ కరువు - పెరిగిన వాహనాల రద్దీ

ఇష్టారీతిగా ఆటోల సంచారం.. ప్రజలకు తీవ్ర అసౌకర్యం

జూలూరుపాడు, జూన్ 23: రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాలు కూడా పెరుగుతున్నాయి. రహదారులపై తిరిగే వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించే వ్యవస్థ సరిగాలేకపోవడంతో కూడళ్లలో వాహనాలను ఇష్టరాజ్యంగా నిలిపివేసి రద్దీని సృష్టించడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతుంది. జూలూరుపాడు ప్రధాన రహదారిపై రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా ఆటోల సంఖ్య బాగా పెరిగిపోయి రహదారిపై నిలిపివేసి సమస్యలు సృష్టిస్తున్నారు ఆటో యజమానులు. ప్రధాన రహదారిపై ఆటోలను ఇష్టానుసారంగా నిలిపివేయటంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అదే విధంగా ప్రజలు కూడా ఈ రద్దీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది వ్యాపారులు రహదారి ప్రక్కనే తమ కార్యకలాపాలు, వ్యాపారాలను సాగిస్తుండటం ట్రాఫిక్ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. నెలల తరుబడి ఈ సమస్య వేధిస్తున్నప్పటికి పరిష్కరించేవారే కరువైపోయారు.

కుదేలైన నియంత్రణ విభాగం..

రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను నియత్రించాల్సిన పోలీస్ శాఖ చూసీ చూడనట్లు వ్యవహరించడంతో సమస్య మరింత తీవ్రమైపోతుందని ప్రజలు అంటున్నారు. పెరుగుతున్న రద్దీ దృష్ట్యా పోలీస్ శాఖ ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటుచేసి రహదారిపై ఇష్టారాజ్యంగా నిలిపివేసే వాహనాలను కట్టడిచేసే విదంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ సమస్యవల్ల నిత్యం ప్రధాన రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రహదారిపై ఆటోలను ఎక్కువ సమయం నిలిపి ఉంచటంతో ఇతర వాహన రాకపోకలకు సమస్యలు తలెత్తి రద్దీ విపరీతంగా పెరుగుతుంది. రహదారిపై నడవాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపి ట్రాఫిక్‌ను నియత్రించాలని ప్రజలు కోరుతున్నారు. ఇష్టారీతిగా వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోంది. దీనిని నివారించే చర్యలు కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ట్రాఫిక్ సిబ్బందిని నియమించడం ద్వారా సమస్య కొంత మేర అయినా పరిష్కారం అవుతుందని ప్రజలు సూచిస్తున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జూలూరుపాడులో ట్రాఫిక్ రద్దీ



ప్రధాన రహదారిపై ఆటోలు

మణుగూరులో పర్యటించిన కలెక్టర్

రామచంద్రయ్యకు నివాళి.. ఎమ్మెల్యే 'పాయం'కు పరామర్శ

మణుగూరు, జూన్ 23: కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం మణుగూరు డివిజన్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మృతి చెందిన విషయానిన తెలుసుకుని మణుగూరు మండలంలోని కూనవరం గ్రామానికి చేరుకున్నారు. రామచంద్రయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రామచంద్రయ్య కుమారుడిని ఓదార్చారు. అనంతరం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్వగృహం చేరుకుని ఆయనను పరామర్శించారు. పాయం మాతృమూర్తి రాములమ్మ చిత్ర పటం వద్ద నివాళ్లు అర్పించారు. కూనవరం చేరుకున్న కలెక్టర్ వాహనం మరమ్మతులకు గురికావడంతో వేరే వాహానంలో కరకగూడెం వెళ్లారు. బూర్గంపాడు జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత రామచంద్రయ్యకు నివాళి అర్పించారు. మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్

చరిత్రాత్మకం రుణ మాఫీ: ఎమ్మెల్యే



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు, జూన్ 23: సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా రూ.2లక్షల రుణమాఫీ చేయటం చరిత్రత్మాకమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. రైతు రుణమాఫీ చేస్తుండటంతో జూలూరుపాడులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 కల్లా ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతని పేర్కొన్నారు. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లు అసందర్భ ప్రేలాపనలను ఇకనైన మానుకొని అన్నదాతల సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు వెంకటరెడ్డి, ఎంపీపీ సోనీ, ఎంపీటీసీ మధుసూదనరావు, పార్టీ మండల అధ్యక్షుడు మంగీలాల్ పాల్గొన్నారు.

భక్తులతో శోభిల్లిన పెద్దమ్మతల్లి ఆలయం



ఆలయంలో భక్తులు

పాల్వంచ రూరల్, జూన్ 23: మండలంలోని కేపీ జగన్నాధపురంలో గల పెద్దమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో శోభిల్లింది. పలు జిల్లాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రావడంతో ప్రాంగణమంతా భక్తజన సందోహంగా మారింది. అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వాహన పూజల కోసం బారులు తీరారు. భక్తులకు దేవస్థానం అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఉచితంగా పులిహోర, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటుచేశారు.

మునిసిపాలిటీ నుంచి తొలగించాలని ఆందోళన

ఇల్లెందు టౌన్, జూన్ 23: ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలోని 1, 2 వార్డుల్లో ఉన్న సత్యనారాయణపురం గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం తమను మున్సిపాలిటీ నుంచి తొలగించి గతంలో మాదిరిగానే గ్రామ పంచాయతీలో విలీనం చేయాలంటూ మహిళలు ఆందోళనకు పూనుకున్నారు. ఇల్లెందు మున్సిపాలిటీలో సత్యనారాయణపురం గ్రామాన్ని గత ఐదు సంవత్సరాల క్రితం గ్రామపంచాయతీ నుంచి తొలగించి మున్సిపాలిటీలో విలీనం చేశారు. విలీనం అనంతరం మున్సిపాలిటీ ఎన్నికలు సైతం జరిగి గ్రామం నుంచి వార్డు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. అయితే గత కొంతకాలంగా మున్సిపాలిటీ అధికారులు సత్యనారాయణపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లు, డ్రైనేజీలతోపాటు వీధిలైట్లు తదితర అభివృద్ధి చర్యలకు పూనుకున్నారు. ఇంటిపన్ను, నీటి పన్ను, మున్సిపాలిటీకి కట్టాలంటూ 1, 2 వార్డుల సముదాయమైన సత్యనారాయణపురంలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు ఇంటింటికి తిరుగుతున్నారు. నీటి పన్ను, ఇంటిపన్నులు కట్టాలని అధికారులు కోరుతున్నప్పటికీ సరైన స్పందన రాలేదు. అనంతరం తమను మున్సిపాలిటీ నుంచి తొలగించాలంటూ ఆందోళనకు పూనుకున్నారు. వార్డులోని రామాలయం వద్ద సుమారు వంద మందికి పైగా మహిళలు నిరసన తెలుపుతూ గతంలో మాదిరిగానే గ్రామపంచాయతీలో విలీనం చేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. తమను మునిసిపల్ పరిధి నుంచి తొలగించాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న మహిళలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దమ్మపేట, జూన్, 23: మందలపల్లి సాంఘిక సంక్షేమ గరుకుల పాఠశాలలో 2006-07 నాటి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తమకు విద్యను నేర్పిన ఉపాధ్యాయలతో ఆనాటి జ్ఞాపకాలను అప్పటి విద్యార్థులుగా పంచుకున్నారు. 17 సంవత్సరాలు తరువాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు పరిచయం చేసుకొని ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు బోధించిన అప్పటి భరత్‌బాబు, పీవీఎన్ పాపారావు, తదితర ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆ బ్యాచ్‌లో చదువుకున్న కోట కిరణ్‌కుమార్ బీహార్ రాష్ట్రంలో ఐపీఎస్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఆదే విధంగా పలువురు వివిధ శాఖలలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు.

వాసవీ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం



విద్యార్థులతో వాసవి క్లబ్ సభ్యులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 23: వాసవి క్లబ్ సేవలు రాబోయే రోజుల్లో భద్రాద్రి జిల్లాలో విస్తృతం చేస్తామని ఇంటర్నేషనల్ డైరెక్టర్ మల్టీపుల్ డైమండ్ మాజేటి రామచంద్రరావు తెలిపారు. ఆదివారం స్నేహ ఆశ్రమంలో చిన్నారులకు పుస్తకాలు, పెన్సిల్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. ఈ సందర్భంగా నవ సమాజ నిర్మాణంలో మేము సైతం తోచిన సహాయం ఇతరులకు అందజేస్తున్నామని అన్నారు.

ఒలింపిక్స్‌లో మరిన్ని పతకాలు సాధించాలి: కూనంనేని

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 23: ఒలంపిక్స్‌లో ఇండియా మరిన్ని పతకాలు సాధించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆశా భావం వ్యక్తం చేశారు. ఆదివారం అంతర్జాతీయ ఒలంపిక్ డే రన్ సందర్భంగా ఏర్పాటు చేసిన రన్‌ను జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో ఒలంపిక్ జ్యోతితో రన్‌లో పాల్గొన్నారు. రన్ ముగించిన అనంతరం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ క్రీడా కారుల చిర కాల స్వప్నం ఒలంపిక్స్ అని గుర్తు చేశారు. ఒలంపిక్స్ క్రీడల్లో పతకాలు సాధించడం ఆ క్రీడాకారుడితో పాటు దేశానికి గర్వకారణంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భద్రాద్రి జిల్లాలో ఈ ఒలంపిక్ రన్‌ను జిల్లా వ్యాప్తంగా నిర్వహించి ముగింపు వేడుకగా కొత్తగూడెంలో నిర్వహించడం స్వాగతిస్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ బి.హరినాధ్‌రెడ్డికి మౌనం పాటించి ఘనంగా నివాళ్ళు అర్పించారు. తొలుత భద్రాద్రి జిల్లా క్రీడల, యువజన అధికారి కె.సంజీవరావు ఒలంపిక్ జ్యోతిని వెలిగించి ఎమ్మెల్యే కూనంనేనికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడల అసోసియేషన్ సభ్యులు శ్రీధర్, బూపేష్, గుములాపురం సత్యనారాయణ, రాజేందర్‌ప్రసాద్, రాధాకృష్ణ, రాచర్ల రఘు, డీవైఎస్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్, సిబ్బంది తిరుమలరావు, లక్ష్మయ్య, కోచ్‌లు నాగేందర్, స్వాతి, పిఈటీలు అక్బర్, హిందూ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న కూనంనేని

నేస్తం ట్రస్ట్ సేవలు అభినందనీయం

బూర్గంపాడు, జూన్ 23: నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత కొనియాడారు. బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నెల్లెల వెంకన్న నేస్తం ట్రస్ట్‌లో సభ్యుడిగా ఉంటూ ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తించేవాడు. మూడు ఏళ్ల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీంతో వెంకన్న కుటుంబానికి అండగా నిలిచేందుకు నేస్తం ట్రస్ట్ తరపున వాట్సాప్ వేదికగా దాతల సాయం కోరగా రూ. 3,16,000లను దాతలు అందజేశారు. వాటిని ట్రస్ట్ ఆధ్వర్యంలో వడ్డీకి ఇవ్వగా రూ.4,44,000లు రావడం జరిగింది. ఆదివారం మోరంపల్లిబంజర జడ్పీఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకన్న కుమార్తె ఉన్నత చదువుల నిమిత్తం ట్రస్ట్ సభ్యులు జడ్పీటీసీ శ్రీలత చేతుల మీదుగా చెక్కును వెంకన్న కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్రీలత మాట్లాడుతూ నేస్తం సంస్థ పేదలకు అండగా నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



చెక్కును అందజేస్తున్న జడ్పీటీసీ

ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ రూరల్, జూన్ 23: ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ అజెండా అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని బిక్కుతండాలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో పని చేసే వారిని ప్రజలు ఆదరిస్తారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. జిల్లాలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం అవసరమైన నిధులు తేవడానికి కృషి చేస్తున్నానన్నారు. పలు పార్టీలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు సీపీఐలో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ చేస్తున్న పోరాటాల పట్ల ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి నాయకు లు ముత్యాల విశ్వనాథం, మండల, పట్టణ కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణ, సాయిబాబా, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గ్రామదేవతకు బోనాలు



బోనాలతో వస్తున్న మహిళలు

జూలూరుపాడు, జూన్ 23: మండలంలోని కరివారిగూడెం పంచాయతీ పరిధిలోని తవసిగుట్ట గ్రామంలో గిరిజన మహిళలు ఆదివారం భక్తిశ్రద్ధలతో గ్రామదేవతకు బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముత్యాలమ్మ కొలుపులో భాగంగా మహిళలు బోనాలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించి ఆలయం వద్దకు వెళ్లి ముత్యాలమ్మకు బోనాలను సమర్పించి పూజలు చేశారు.

ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థికి సన్మానం

ఆళ్లపల్లి, జూన్ 23: ఆళ్లపల్లి మండలంలో పదోతరగతి ప్రథమ స్థానం సాధించిన మలిపెద్ది ప్రణవిని ఆదివారం ఆళ్లపల్లి పెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రణవి అనంతోగు ఖస్తుర్బా పాఠశాలలో పదో తరగతి చదివింది. ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు ఫయిామ్ ఆధ్వర్యంలో మలిపెద్ది ప్రణవిని సన్మానించి, డిక్షణరీని బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రిన్స్‌పాల్ పద్మ, ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు కోటేష్, ఖలీల్, శేఖర్, యోగి, శ్రవణ్ పాల్గొన్నారు.

అవినీతిపై దృష్టి సారించండి

పాల్వంచ టౌన్, జూన్ 23: నియోజకవర్గంలో జరుగుతున్న అధికారుల అవినీతిపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర నాయకులు కనగాల అనంతరాములు కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన అధికారులను ఉద్యోగ బాధ్యతల నుంచి శాశ్వతంగా డిస్మిస్ చేయాలన్నారు. అధికారు అవినీతి రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్ర రవి, బత్తిని దుర్గారావు గౌడ్, బెల్లంకొండ బాబురావు, సుధాకర్, సొసైటీ డైరెక్టర్ సీతా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ కవాత్‌ను జయప్రదం చేయండి

జూలూరుపాడు, జూన్ 23: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా వరంగల్‌లో వచ్చే నెల 7న నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాత్‌సభకు లక్షలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ భద్రాద్రి జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1994 జూలైలో ఎస్సీవర్గీకరణ సాధనే లక్ష్యంగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉద్యమం ప్రారంభమైందని, జూలై 7వ తేదీ నాటికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆత్మగౌరవ కవాత్ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు చెంగల గురునాథం, సంఘం మండల అధ్యక్షుడు దిబ్బెందల సాయికుమార్, నాయకులు వెంకటి, శివ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పాయం'కు పలువురి పరామర్శ



చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

అశ్వాపురం, జూన్ 23: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆదివారం మండల టీజేఎస్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే మాతృమూర్తి రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాములమ్మ చిత్రపటానికి నివాళులర్పించి ఎమ్మెల్యేను ఓదార్చారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు పగడాల కరుణాకర్‌రెడ్డి, సురకంటి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉపేందర్, సత్యం, మొండికుంట గ్రామస్థులు యాకయ్య, శ్రీనివాసరెడ్డి, లవకుశరెడ్డి, రామారావు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పనిచేస్తాం: తాండ్ర

అశ్వారావుపేట, జూన్ 23: ఎన్నికలలో గెలుపోటములతో నిమిత్తం లేకుండ బీజేపీ నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఖమ్మం బీజేపీ పార్లమెంట్ స్థాయి నాయకుడు తాండ్ర వినోదరావు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తాండ్ర వినోదరావు మాట్లాడుతూ చాలా మంది ఓడిన తరువాత ప్రజలకు కనపడరని, బీజేపీ అలాంది కాదని, ఓడినా, గెలిచినా చిత్తశుద్ధితో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందని, ఎన్నికల సమయంలో అశ్వారావుపేట నియోజకవర్గంలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ముఖ్యంగా పామాయిల్ రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పామాయిల్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే పామాయిల్ రైతు సంక్షేమ సంఘం ప్రతినిధులతో పామాయిల్ రైతుల సమస్యలపై చర్చించడం జరిగిందన్నారు. కొత్తగూడెంలో విమానాశ్రయం, కొవ్వూరు- భద్రాచలం రైల్వే లైను, గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్స్ ఏర్పాటు, సేంద్రీయ ఎరువులతో పంటలు పండించడం, సంబంధిత పరి శ్రమలు ఏర్పాటుకు ఆర్థిక తోడ్పాటు, అవగాహన కల్పించే సదస్సులను కేంద్ర ప్రభుత్వం ద్వార ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాండ్ర వినోదరావు

ముఖర్జీది ప్రత్యేక స్థానం



లక్ష్మీదేవిపల్లి, జూన్ 23: జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశ రాజకీయాల్లో కీలకమైన పాత్ర పోషించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ తెలిపారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగా కిరణ్ మాట్లాడారు.